## మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి



రమేశ్‌కు సంబంధించి వైద్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లి, మే 16 :** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. రామాంతపూర్ డివిజన్ శ్రీ రామా కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రమేశ్ ప్రమాదానికి గురికావడంతో పార్టీ నాయకుడు గంధం నాగేశ్వర్‌రావు సమాచారం మేరకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రమేశ్‌ను గురువారం దవాఖానకు వెళ్లిపరామర్శించి వైద్య సేవలను అడిగి తెలుసుకొని ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, మందపాటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

**జవహర్‌నగర్, మే 16:** సర్కారు భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లను తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కాశీరాం, రమేష్, రవి, చంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది



నాచారం ప్రధాన రహదారిలో చేరిన వరదనీరు



వర్షం నీటితో జలమయమైన మల్లాపూర్-నాచారం రోడ్డు

# భారీ వర్షం..కరెంట్ కట్

- ప్రధాన రోడ్లపై చేరిన వరదనీరు
- ఇబ్బందులు పడిన వాహనదారులు
- పలు చోట్ల తెగిన విద్యుత్ తీగలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం



చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డినగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

**ఉప్పల్, మే 16 :** నగరంలో కురిసిన వర్షానికి ఉప్పల్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ ప్రాంతాలలో వరదనీరు చేరింది. హబ్సిగూడ చౌరస్తా నుంచి మల్లాపూర్ వరకు నిర్మించిన రోడ్డులో వర్షానికి వరదనీరు చేరింది. నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో రోడ్డుపై భారీగా వరదనీరు చేరింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. నాచారం ప్రాంతంలో రహదారి చెరువును తలపించింది. కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేసిన, వరద నీరు నిలిచిపోవడంపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ తెలిపారు.

**మల్లాపూర్:** గురువారం సాయంత్రం రెండు గంటల పాటు కురిసిన వర్షానికి మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో చెట్ల మధ్యన ఉన్న విద్యుత్ తీగలు తెగిపోవడంతో కాలనీవాసులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో వెంటనే విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

**కీసర:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం అధికారులు కరెంట్‌ను తీసివేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇంకా రైతులు కోసిన ధాన్యం చాలా వరకు కల్లాల్లోనే ఉండిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనకపోవడంతో రైతుల పరిస్థితి మరి దారుణంగా మారింది.



చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ ప్రధాన రహదారిలో వర్షం నీటిని తొలగిస్తున్న సిబ్బంది



మల్లాపూర్: తిరుమలనగర్‌లో తెగిపోయిన విద్యుత్ తీగలను సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది

# ఓటింగ్ సరళిపై ఎమ్మెల్యే మర్రి ఆరా

**మల్కాజిగిరి, మే 16:** ఎంపీ ఎన్నికల ఫలితాలు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఎన్నికల ఓటింగ్ సరళిపై నాయకులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం నలబై రోజులు ఇంటింటికీ ప్రచారంతో పాటు కాంగ్రెస్, బీజేపీ పార్టీల వైఫల్యాను ప్రజలకు తెలిపి అవగాహన కల్పించడంలో నాయకులు, కార్యకర్తలు కీలకప్రాత్ర పోషించారని అన్నారు. ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, హుడా మాజీ చైర్మన్ వీరేషంయాదవ్, బూత్ నాయకులు సమన్వయంతో కృషి చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ శ్రీధర్, కార్పొరేటర్లు మీనా ఉపేందర్ రెడ్డి, సునీతరాయు యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, అంజయ్య, పరశురాం రెడ్డి, వెంకన్న, లడ్డు, నరేందర్ రెడ్డి, కరంచంద్, జీకే హన్మంతరావు, అనిల్‌కిశోర్, రమేశ్, పరమేష్, చిన్నాయాదవ్, శైలేందర్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, శోభన్, మధుసుదన్ రెడ్డి, ఇబ్రహీం, ఉస్మాన్, సంతోష్, మహేష్, జనార్దన్, మల్లేష్, మహేందర్ తదితరుల పాల్గొన్నారు.

**ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే**

**నేరేడ్‌మెట్:** వినాయకనగర్ డివిజన్ కాకతీయనగర్‌కు చెందిన సంజయ్ చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే ఆదేశాలమేరకు సంజయ్‌కు రూ.1.50వేల విలువైన ఎల్‌ఓసీ మంజూరైంది. అదేవిధంగా మౌలాలి డివిజన్ సాయినాథ్‌పురంకు చెందిన వాణికి ఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.5లక్షలు మంజూరు అయ్యాయి.ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సంజయ్, వాణి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎల్‌ఓసీ అనుమతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పరశురాంరెడ్డి, చంద్రమౌళి, ఫరీద్, శేఖర్‌గౌడ్, అరుణ్, ఉమేష్,శైలేందర్, దినేష్, ఇబ్రహీం కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకులతో ఓటింగ్ సరళిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



ఉప్పల్ ప్రధాన రహదారిలో వర్షంలో చిరువ్యాపారులు, వాహనదారుల కష్టాలు

## వర్షాలకు మున్సిపాలిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**ఘట్‌కేసర్,మే16:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మున్సిపాలిటీ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీ సూచించారు. గురువారం మున్సిపాలిటీకి చెందిన విద్యుత్,నీటి సరఫరా,ఎమర్జెన్సీ,వార్డు ఆఫీసర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిలకుండా జాగ్రత్త వహించాలని అన్నారు.ప్రజలు ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 9154083772 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యలపై ఫిర్యాదు చేయాలని కమిషనర్ ప్రజలను కోరారు.

## యువతి అదృశ్యం



పావని(ఫైల్)

**మేడ్చల్, మే 16 :** యువతి అదృశ్యమైన ఘటనకు సంబంధించి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీకాకుళంకు చెందిన తాటికొండ జయమ్మ దంపతులు మేడ్చల్ మండలంలోని ఎల్లంపేటలో నివాసం ఉంటుంది. వారి కూతురు పావని(20) డబిల్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న ఇన్ఫోటెక్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఈనెల 13న తన స్నేహితురాలి పుట్టినరోజు ఫంక్షన్ ఉందని చెప్పి, ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అలా వెళ్లిన పావని తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గురువారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మురళీధర్ తెలిపారు.

## రేపు వేంకటేశ్వరస్వామి కల్యాణం

**శామీర్‌పేట,మే 16 :** శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కేశవరం గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న ఉదయం 11 గంటలకు అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 19న సత్యనారాయణస్వామి వ్రతాలు, పొన్నసేవ, 21న ఉదయం గరుడసేవ, హోమాలు, పూర్ణాహుతి, రాత్రి మొక్కు సేవలు, 22న తెల్లవారు జామున రథోత్సవం, 23న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శామీర్‌పేట, మే 16:** ఐటీఐలో ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.లలిత కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. శామీర్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాలలో 2024-25వ విద్యా సంవత్సరానికి మొదటి విడుత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, కోపా(కంప్యూటర్ ఆపరేటింగ్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాస్ అయి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16-05-2024 నుంచి 10-06-24 వరకు www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## మహిళ ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**చర్లపల్లి, మే 16 :** మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో గురువారం కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ స్థానాలు సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు భాగ్యమ్మ, రమాదేవి, నవనీత, అరుణ, సంధ్య, మున్ని, శిరీషా, గిరజ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి మొక్కను అందజేస్తున్న స్థానిక మహిళానాయకులు

## డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

**మేడ్చల్ రూరల్, మే 16 :** జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మమత మెడికల్ కళాశాల సౌజన్యంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు డెంగీ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య, సీహెచ్‌వో మహాలక్ష్మక్ష్మి, పీహెచ్‌ఎన్ మరియమ్మ, సూపర్ వైజర్ బుజ్జి, మమత మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజా విక్రం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

## పీఏసీఎస్‌లో అందుబాటులో టార్పాలిన్లు

**కీసర, మే 16:** కీసర మండల ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో రైతుల కోసం సబ్సిడీపై టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న రైతుల పేర్లను నమోదు చేయించి కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## డెంగీపై అవగాహన పెంపొందించుకోవాలి

శేరిలింగంపల్లి, మే 16 : డెంగీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించి వారిని చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చందర్ అన్నారు. డెంగీ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి శేరిలింగంపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

# ఏక్ భారత్..శ్రేష్ఠ్ భారత్ శిబిరం ప్రారంభం





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌సీసీ డీడీజీ వీఎం రెడ్డి, హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు, అధికారులు

**మేడ్చల్, మే 16 :** వివిధ రాష్ట్రాల మధ్య సంస్కృతి, సంప్రదాయాల బదిలీనే లక్ష్యంతో ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డీడీజీ వీఎం రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ ఆడియటోరియంలో ఏక్ భారత్..శ్రేష్ఠ్ భారత్ శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ శిబిరం ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఎన్‌సీసీ డీడీజీ, ఎయిర్ కమాండోర్ వీఎం రెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల మధ్య తమ సంస్కృతి, సంప్రదాయాల బదిలీకి ప్రతి ఏటా ఏక్ భారత్..ఏక్ శ్రేష్ఠ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడాదికి రెండు శిబిరాలు జరుగుతాయన్నారు. ఇదే కాకుండా నేషనల్ ఇంటిగ్రేటెడ్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు ఉంటారని తెలిపారు. సీఎంఆర్‌లో నిర్వహిస్తున్న శిబిరంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో పాటు రాజస్థాన్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. మొత్తం 600 మంది విద్యార్థులు ఉండగా 150 మంది రాజస్థాన్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. మొత్తం ఆరు గ్రూపులను ఏర్పాటు చేశారని తెలిపారు. శిబిరంలో విద్యార్థులు తమకు ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను పంచుకుంటారని తెలిపారు. ఒకే చోట ఉండటంతో తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో, రాజస్థాన్ విద్యార్థులతో సంస్కృతి, సంప్రదాయాలు వేరైనా కలిసిపోతారని తెలిపారు. గతేడాది గజ్వేల్‌లో నిర్వహించిన శిబిరంలో వేరే రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులతో మన రాష్ట్ర విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనల ద్వారా ఇరు రాష్ట్రాల విద్యార్థులు తన రాష్ట్రాల్లో ఉన్న నృత్యాలపై అవగాహన పెంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా సమైక్యత పెంపొందుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కల్నల్ సంజయ్ గుప్తా, కల్నల్ డోగ్రా, కల్నల్ అనిల్‌కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ ఆనందరావు, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీనివాస్, మేజర్ మీను తోమర్, రాజస్థాన్ ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ అమిత్, జ్యోతికుమారి, అన్షుల్ సక్సేనా, లలిత్ చౌదరి, సుబేదార్ రాజేశ్ సింగ్, నాయబ్ సుబేదార్ రాచ్‌పాల్ సింగ్, హవల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కొంపల్లి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో..

# వీడని వీధి కుక్కల దాడులు

- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- ఇప్పటికే 50 మందికి పైగా కుక్కకాటు బాధితులు
- తాజాగా మరో మహిళ పై దాడి



వీధికుక్కల దాడిలో గాయపడిన సరిత

**కుత్బుల్లాపూర్, మే 16:** ఒకటి కాదు రెండు అంతకంటే కాదు.. ఏకంగా 50 మందికిపైగా బాధితులు ఆ ఒక్క కాలనీలోనే ఉన్నారు. వెంటాడి మరీ దాడి చేస్తూ వీధికుక్కలు ఆ కాలనీలో స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఏకంగా ఇంట్లోకి వచ్చి మరీ దాడి చేస్తున్నండటంతో ఆ కాలనీ ప్రజలంతా వీధి కుక్కలంటేనే భయపడే పరిస్థితి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో నెలకొన్నది. తాజాగా అదే కాలనీకి చెందిన ఓ గృహిణి సరిత(31) తన ఇంటి గేటు ముందు నిలబడి ఉన్నది. దీంతో వీధికుక్క లోపలికి వచ్చి కాలుకు కాటువేసి పారిపోయింది. దీంతో ఆమె గత ఫిబ్రవరి 4వ తేదీన తన పాప తన్విహపై వీధి కుక్క దాడి చేసింది. ఇలా వరుసగా 50 మందికిపైగా దాడులు చేసి గాయపర్చడంతో ఆ కాలనీ ప్రజలంతా ఇప్పుడు నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సంబంధిత కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు దాడులు జరిగినప్పుడే అడపాదడపాగా తగు చర్యలు తీసుకోవడంతో సమస్య మొదటికి చేరుతుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదటగా ఇక్కడ వీధికుక్కల పునరుత్పత్తి జరగకుండా తీసుకోవాల్సిన చర్యల కోసం చారి అనే వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చిన అధికారులు.. సదరు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన బిల్లులో లక్షలకుపైగా పెండింగ్‌లో ఉండడంతో ఇక్కడి కాంట్రాక్ట్‌ను వదులుకున్నాడు. ఆ తర్వాత బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని సంస్థకు సైతం లక్షల్లో పెండింగ్‌లో పెట్టడంతో ఆ సంస్థ నిర్వాహకులు సైతం ఇక్కడికి రావడానికి ఆసక్తిని కనబర్చడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనేకసార్లు కాలనీలో వీధికుక్కల నుంచి విముక్తి కల్పించాలని ఆందోళనలు, ధర్నాలు చేశామని, సంబంధిత మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా తమ కాలనీలో సమస్య అలాగే ఉందని కాలనీ అసోసియేషన్ నిర్వాహకులు శివాజీరాజు తెలిపారు. ఇప్పటికైనా తమ కాలనీలో వీధికుక్కల దాడి నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కాలనీవాసులంతా ఏకమై ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్(ఎన్‌ఎంసీ) పరిధి, 32వ డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్‌ఆర్)అన్నారు. 32వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డితోపాటు పలువురు నేతలు, బస్తీవాసులు గురువారం కేఎస్‌ఆర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి పైప్‌లైన్, నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించారు. అదే విధంగా 31వ డివిజన్‌కు చెందిన అరుణతో పాటు ప్రగతినగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కేఎస్‌ఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

*– దుండిగల్, మే 16*